సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం। 22। నవంబర్। 2024



సోమశిలలో 70.837 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 70.83 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4750 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్ల (10 గ్రా)	రూ.79,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,173
3 శాతం జీఎస్టీతో	రూ.7,388
నవర (8 గ్రా)	రూ.59,104

గరిష్టం/కనిష్టం
31.5 /23.0

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 69 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



అరుణమ్మకు మొక్కను అందజేస్తున్న విద్యారమ

నెల్లూరు (పొగతోట): జెడ్పీ సీఈఓగా విద్యారమ బాధ్యతలను గురువారం స్వీకరించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు కలిసి అభినందనలను తెలియజేశారు.

11న వాహనాల వేలం

నెల్లూరు(అర్బన్): వైద్య, ఆరోగ్య శాఖలో కాలవ్యవధి ముగిసిన రెండు వాహనాలను డిసెంబర్ 11న వేలం వేయనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి సంబంధించిన సాధారణ నిబంధనలు, షరతులు, సవరణలు, సమయ పొడిగింపు తదితరాలకు konugolu.ap.gov.inను పరిశీలించాలని కోరారు.

ఎన్‌సీసీ ఉత్తమ అధికారిగా నరేంద్రబాబు



నెల్లూరు (టౌన్): ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఎన్‌సీసీ నావల్ యూనిట్ ఉత్తమ అధికారిగా గుండాల నరేంద్రబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ నుంచి ఉత్తర్వులు గురువారం అందాయి. హైదరాబాద్ మెహదీపట్నంలోని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును ఈ నెల 24న అందుకోనున్నారు. కాగా బీవీనగర్‌లోని కేఎన్నార్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను హెచ్‌ఎం విజయప్రకాష్‌రావు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఆర్టీసీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలో సంస్థ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని త్వరలో కల్పించనున్నామని చెప్పారు. అదనపు బస్సులను ఏర్పాటు చేసి, చార్జీల తగ్గింపునకు కృషి చేస్తామని వివరించారు. సంస్థలో ఏడు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడారు. ఆర్టీసీ నెల్లూరు జోనల్ అధికారులతో సమన్వయం చేసుకొని అభివృద్ధి దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రగతి పథంలో నడిపిస్తామని ప్రకటించారు. మారుమూల ప్రాంతాలకూ బస్సు సౌకర్యాన్ని కల్పించేలా చూస్తామని వివరించారు. తొలుత నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి సురేష్‌రెడ్డి నివాళులర్పించారు.

బస్సుల ప్రారంభం

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నాలుగు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును కొనకళ్ల నారాయణ ప్రారంభించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఆర్టీసీ నెల్లూరు జోన్ ఆర్‌ఎం మురళీబాబు, ఈడీ వెంకటేశ్వరరావు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేతలు వంశీరెడ్డి, సన్నపురెడ్డి దయాకర్‌రెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

‘అపార్’పై సమీక్ష



నెల్లూరు (టౌన్): ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)ను వేగవంతం చేయాలని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. వీఆర్సీ సెంటర్‌లోని రావూస్ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ హెచ్‌ఎంలో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అపార్ నమోదులో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు. డీఈఓ బాలాజీరావు, నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇసుక.. ఉదయగిరి మండలం గండిపాళెంలోని పెద్దిరెడ్డిపల్లి రోడ్డు నుంచి గురుకుల పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిల్వ చేసింది. వాస్తవానికి దీని నిర్మాణానికి గానూ జాతీయ ఉపాధి హామీ ద్వారా రూ.ఎనిమిది లక్షలను మంజూరు చేశారు. అంచనాల మేరకు రహదారి నిర్మాణానికి పెన్నాలోని అప్పారావుపాళెం నుంచి ఇసుకను వాడాలి. అయితే స్థానికంగా ఉన్న పిల్లాపేరులో నాణ్యత లేని మట్టి, దుమ్ము శాతం అధికంగా ఉన్న ఇసుకను ఉపయోగిస్తున్నారు. చీమకుర్తి నుంచి కంకరను వాడాల్సి ఉన్నా, స్థానికంగా లభ్యమయ్యే నాణ్యత లేని దాన్నే వినియోగిస్తున్నారు.



ఈ చిత్రంలోని సిమెంట్ రోడ్డు కొండాపురం మండలం గానుగుపెంటపల్లి ఎస్సీ కాలనీలోది. దీన్ని రెండు వారాల క్రితం నిర్మించారు. ఆ సమయంలో నిబంధనలను పాటించలేదనే విమర్శలున్నాయి. పెన్నా ఇసుక స్థానంలో గానుగపెంటపల్లి వద్ద గల వాగు నుంచి నాసిరకాన్ని వినియోగించారు. 20.. 12 ఎంఎం కంకరను మిక్సింగ్‌లో వాడాల్సి ఉన్నా, అదీ చేయలేదు. క్యూరింగ్‌ను మూడు వారాల పాటు చేపట్టాల్సి ఉన్నా, రెండు వారాల్లోనే ముగించారు. ఈ రెండూ కేవలం ఉదాహరణలు మాత్రమే. జిల్లావ్యాప్తంగా చేపట్టిన సిమెంట్ రోడ్ల పరిస్థితి దాదాపు ఇంతే కావడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

దోపిడీకి పచ్చబాట



తమ్ముళ్లకు పండగలా మారిన సీసీ రోడ్ల నిర్మాణం



ఉదయగిరి మండలం తిరుమలాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న నాసిరకం ఇసుక

- రూ.22 కోట్ల మంజూరు
- నాసిరకంగా ప్రక్రియ
- ఇసుక స్థానంలో అంతా మట్టే
- కొరవడిన పర్యవేక్షణ

ఉదయగిరి: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి.. సొంత పార్టీల నేతల కడుపులు నింపేందుకు అవినీతి, అక్రమాలకు కూటమి ప్రభుత్వం బాటలేసింది. ఉపాధి నిధులను కొల్లగొట్టడమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.కోట్ల విలువజేసే పనులను కట్టబెట్టింది. అధికారుల అండతో నిధుల స్వాహానే ధ్యేయంగా పెట్టుకొని అరకొరగా.. నాణ్యతకు తిలోదకాలిచ్చి వీటిని నిర్మిస్తున్నారు.

నాణ్యతలో రాజీపడేది లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తన ఉపన్యాసాలతో తరచూ ఊదరగొడుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అధికారంలోకి వచ్చాం.. ఇక దోపిడీ చేసుకోండంటూ టీడీపీ నేతలకు కూటమి ప్రభుత్వమే దారి చూపిందనేది అక్షర సత్యం. తామేదో చేసేస్తున్నామని కలరింగ్ ఇచ్చేందుకు ఇలా ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు.

ఇదీ తంతు..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల పేరుతో ఉపాధి నిధులను కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. తదనుగుణంగా పల్లెపండగ పేరుతో అక్టోబర్ 14 నుంచి 20 వరకు తెలుగు తమ్ముళ్లు శంకుస్థాపనలు చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనలో అవినీతి, అక్రమాలకు రుచి మరిగి రూ.కోట్లు దోచేసిన వీరికి మరోమారు ఆకలి తీర్చుకునే అవకాశాన్ని కల్పించారు.

నాణ్యత ప్రశ్నార్థకం

జిల్లాలో జాతీయ ఉపాధి నిధులతో మెటీరియల్ కాంపోనెంట్ కింద మొదటి దశలో రూ.80 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 100 రోజుల్లో.. అంటే సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఇవి స్థానిక పంచాయతీ పాలకవర్గాలు, సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే టీడీపీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ పరిణామాల క్రమంలో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ నేతలు, కార్యకర్తల ప్రయోజనాల కోసమే ఉపాధి నిధులతో ఈ పనులను చేపట్టారనే అంశం స్పష్టంగా అర్థమవుతోంది.

పర్యవేక్షణేదీ..?

మొదటి విడతలో ప్రతి మండలానికీ రూ.రెండు కోట్ల నుంచి రూ.నాలుగు కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇలా ఉదయగిరి నియోజకవర్గంలో రూ.22 కోట్లను ఖర్చు చేయనున్నారు. మరోవైపు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత డొల్లగా మారింది. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఒకవేళ ఏ అధికారైనా నాణ్యత విషయమై ప్రశ్నిస్తే, తాము అధికార పార్టీకి చెందిన వారిమని, తాము చెప్పినట్లే చేయాలంటూ దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, వారి నుంచి సహకారం లభించడంలేదని కొందరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు పేర్కొంటున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, జలదంకి, కలిగిరి మండలాల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది.

నాణ్యతలో రాజీ లేదు

నాణ్యత విషయంలో రాజీలేదు. ఎక్కడైనా నాసిరకం ఇసుక, కంకరను వినియోగిస్తున్నారని మా దృష్టికి తెస్తే పనులను నిలిపేయిస్తాం. నాణ్యతగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నాం. అంచనాల్లో పేర్కొన్న విధంగా సామగ్రిని తెప్పించి, నాణ్యతగా పనులు చేయిస్తాం.

– శ్రీనివాసరాజు, ఏఈ, పంచాయతీరాజ్, ఉదయగిరి

మా ముందే మైకులో మాట్లాడతారా..?

- లాక్కునేందుకు పోలీసుల యత్నం
- మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరడమే తప్పా..?
- ఖాకీల తీరుపై స్థానికుల అసహనం



స్థానికులు, పోలీసుల మధ్య వాగ్వాదం

నెల్లూరు(క్రైమ్): తమ ప్రాంతం నుంచి మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు కోరడమే తప్పనే రీతిలో పోలీసులు చెలరేగిపోతున్నారు. వాకర్స్ రోడ్డులో జనావాసాల నడుమ ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలంటూ ఆ ప్రాంతవాసులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళనను వారు గురువారం తీవ్రం చేశారు. మద్యం దుకాణంతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోందని మైకులో స్థానిక మహిళలు మాట్లాడసాగారు. ఈ తరుణంలో మైకును లాక్కునేందుకు చిన్నబజార్ పోలీసులు యత్నించారు. దీంతో పోలీసులు.. స్థానికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఖాకీల తీరును నిరసిస్తూ వారు నినాదాలు చేశారు. వైన్ షాపును తొలగించేంత వరకు ఆందోళనను విరమించేది లేదని వారు తేల్చిచెప్పారు. కాగా మైకును లాక్కునేందుకు యత్నించిన ఘటనపై పోలీసులను సంప్రదించగా, దాని వినియోగానికి అనుమతి లేదని, ఇలా వ్యవహరించడం తగదని సూచించామని బదులిచ్చారు.

‘సాగునీటి’ ఎన్నికలు ఈసారైనా జరిగేనా..?

- ఇప్పటికే రెండుసార్లు వాయిదా
- తాజాగా డిసెంబర్ ఐదు నుంచి ప్రక్రియ

జిల్లాలో ఇలా..

ప్రాదేశిక నియోజకవర్గాలు	వినియోగదారుల సంఘాలు
3698	490

ఓటర్లు - దాదాపు మూడు లక్షలు



జలవనరుల శాఖ జిల్లా కార్యాలయం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) / ఆత్మకూరు రూరల్: సాగునీటి నిర్వహణలో నీటి సంఘాల పాత్ర ఎంతో ప్రాధాన్యమైంది. చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడంలో సాగునీటి సంఘాల యాజమాన్యాలు ఎంతో శ్రద్ధ వహిస్తాయి. ఇంతటి కీలకమైన ఎన్నికలను ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసింది. తాజాగా ఎన్నికలను డిసెంబర్‌లో నిర్వహించేలా సన్నాహాలు చేస్తోంది. కాగా ఎన్నికల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే పరిస్థితి లేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసే నాటికి సగం సీజనైపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ తీరు..

జిల్లాలో ప్రధాన జలవనరులైన సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులకు కలిపి ఆరు ప్రాజెక్ట్ కమిటీలు.. 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు.. 490 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు.. 3698 టీసీల (ప్రాదేశిక నియోజకవర్గ)కు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది.


ప్రక్రియ నిర్వహణ ఇలా..

ఏకగ్రీవాలు, చేతులెత్తే విధానం, రహస్య పద్ధతుల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు తొమ్మిది వేల మంది సిబ్బంది అవసరమవుతారు. నోడల్ అధికారిగా జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ దేశ్‌నాయక్ వ్యవహరించనున్నారు.

ముఖ్యమైన తేదీలు..

- డిసెంబర్ ఐదు నుంచి 14లోపు ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- ఎన్నికల నోటిఫికేషన్‌ను డిసెంబర్ ఐదున విడుదల చేయనున్నారు.
- ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ) సంఘాల సభ్యుల ఎంపిక.. నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలను డిసెంబర్ ఎనిమిదిన నిర్వహించనున్నారు.
- డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలను 11న.. ప్రాజెక్ట్ కమిటీలను 14న ఎన్నుకోనున్నారు.

జియో ట్యాగింగ్ నత్తనడక



జిల్లాలోని 38 మండలాల్లో గల 722 గ్రామ పంచాయతీలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల్లోని ప్రతి ఇంటినీ మ్యాపింగ్ (జియో ట్యాగింగ్) చేయాలని గ్రామ, వార్డు సచివాలయ రాష్ట్ర డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. – కావలి

- జిల్లాలోని 530 గ్రామ, 220 వార్డు సచివాలయాల్లో గల ఉద్యోగులు క్లస్టర్ వారీగా ప్రతి ఇంటినీ జియోట్యాగింగ్ చేస్తున్నారు.
- ప్రతి సచివాలయ పరిధిలో 11 మంది ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో ఉద్యోగి గ్రామాల్లో 70 నుంచి 80 ఇళ్లను మ్యాపింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.
- జిల్లాలో 8,47,587 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,87,718 కుటుంబాల్లో ఇంటింటి మ్యాపింగ్‌ను పూర్తి చేశారు. మిగిలిన 3,59,869 కుటుంబాల్లో సర్వే చేయాల్సి ఉంది.
- చంద్రబాబు ప్రభుత్వం ఇళ్లను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను కూడా నమోదు చేసి డేటా బేస్ నమోదు చేస్తోంది.
- భవిష్యత్తులో సంక్షేమ పథకాల మంజూరు, తొలగింపుపై ఈ సర్వే ప్రభావం ఉంటుందనే భావనతో జియో మ్యాపింగ్‌కు ప్రజలు వెనుకడుగేస్తున్నారు.



కావలి పట్టణంలో ఇంటి వివరాలను మ్యాపింగ్ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ప్రజలు సహకరించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేయడానికి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి చేస్తున్న జియో ట్యాగింగ్ సర్వేకు ప్రజలు సహకరించాలి. ప్రభుత్వ నిబంధనల మేరకే ఉద్యోగులు సర్వే చేస్తున్నారు.

– శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి మున్సిపాలిటీ

ఎక్కువ సమయం పడుతోంది

నివాసాలకు జియో ట్యాగింగ్‌లో భాగంగా ప్రతి ఇంటినీ మ్యాపింగ్ చేయడం ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయి. గ్రామాల్లోని ప్రజలు ఊళ్లు, పనులకెళ్తుండటంతో ఉద్యోగులు తరచూ అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం ఎక్కువ తీసుకుంటోంది.

– సీహెచ్ శ్రీదేవి, ఎంపీడీఓ, కావలి

పారిశ్రామికాభివృద్ధికి చర్యలు వేగవంతం



మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా చర్యలను అధికారులు వేగవంతం చేయాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పరిశ్రమలకు సంబంధించిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లాకు మంజూరైన పారిశ్రామిక క్లస్టర్లపై దృష్టి సారించి వాటిని త్వరగా గ్రౌండింగ్ చేయాలని చెప్పారు. ప్రింటింగ్, నోట్‌బుక్స్ తయారీ క్లస్టర్ విషయమై రెవెన్యూ, అటవీ శాఖాధికారులు ఉమ్మడిగా తనిఖీలను నిర్వహించి పురోగతి చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన పథకం ద్వారా గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలని సూచించారు. విశ్వకర్మ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు రుణాలను విరివిగా మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో ఎమ్మెస్సెమ్మీ సర్వేను ఈ నెల 29 నుంచి నిర్వహించేందుకు గానూ క్షేత్రస్థాయి సిబ్బందికి తక్షణమే శిక్షణ నివ్వాలని ఆదేశించారు. డీఐసీ జీఎం మారుతిప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం శేఖర్‌రెడ్డి, ఆర్డీఓ అనూష, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డ్వామా, డీఆర్డీఏ, ఏపీఎంఐపీ పీడీలు గంగాభవానీ, నాగరాజకుమారి, శ్రీనివాసులు, కార్మిక శాఖ డీసీ వెంకటేశ్వర్లు, సభ్యులు ఏపీకే రెడ్డి, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు సీట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రిన్సిపల్ వీరవెంకట నాగరాజమన్నార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ చదివిన వారు దరఖాస్తు చేసుకోవాలని, బైపీసీ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత ఎంపీసీ విద్యార్థులకు, అప్పటికీ సీట్లు మిగిలితే ఇతర గ్రూపుల వారిని పరిశీలించనున్నామని తెలిపారు. డిప్లొమా ల్యాబ్, అనస్థీషియన్, ఆప్తాల్మిక్, ఆప్టోమెట్రీ, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్లు తదితరాలకు సంబంధించి 95 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నామని, దరఖాస్తులను మెడికల్ కళాశాలలో డిసెంబర్ రెండులోపు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయాలని కోరారు. దరఖాస్తు రుసుముగా రూ.100ను చెల్లించాలని చెప్పారు. రిజిస్టర్ పోస్ట్ లేదా acsrgmcnlr @gmail. com కు సైతం పంపవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు spsnellore. ap. gov. in/notice/recruitmentను పరిశీలించాలని సూచించారు.



ప్రమాదం 'అంచున' ప్రయాణం

ట్రక్కు ఆటోలో వస్తువులను పెట్టుకుని.. ప్రమాదకర స్థితిలో కొందరు ప్రయాణిస్తుండగా నెల్లూరు ఆర్టీసీ సమీపంలో తీసిన చిత్రం.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఎనీటైం మద్యం

కూటమి ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా విక్రయాలు

- నిబంధనలు గాలికి..
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు
- ముందస్తు ఒప్పందాలే అని విమర్శలు

కూటమి ప్రభుత్వంలో జిల్లాలో ఎనీటైం మద్యం దొరుకుతోంది. సమయపాలన పాటించాలి. నిర్దేశిత ధరలకే మద్యం విక్రయించాలి. లేకపోతే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నారు. కానీ లెక్క చేయకుండా మద్యం వ్యాపారులు యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తున్నారు.

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో 182 మద్యం దుకాణాలున్నాయి. నూతన ఎక్సైజ్ పాలసీ అమలులోకి వచ్చాక సుమారు 75 శాతానికి పైగా దుకాణాలను అధికార పార్టీకి చెందిన వారే దక్కించుకున్నారు. అధికార బలంతో ఎక్సైజ్ అధికారులను తమవైపు తిప్పుకొన్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలనకు తూట్లు పొడుస్తున్నారు. ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే మద్యం దుకాణాల్లో విక్రయాలు సాగించాలి. అధిక శాతం మంది తెల్లవారక ముందు నుంచి అర్ధరాత్రి వరకు బహిరంగంగానే విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇక బార్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

బెల్టు జోరు

జిల్లాలో దాదాపు అన్ని షాపులకు అనుబంధంగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇది నేరం. అయితే మద్యం వ్యాపారం అధికార పార్టీకి చెందిన వారి చేతుల్లోకి వెళ్లడంతో పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్దేశిత ధరకంటే క్వార్టర్‌పై రూ.40 వరకు మందుబాబుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. నెల్లూరు నగరంలో 30 మద్యం దుకాణాలు ఉండగా ప్రతి దాని పక్కనే కూల్‌డ్రింక్ షాపుల ముసుగులో సిట్టింగ్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపుల్లో విక్రయాలు సాగుతున్నాయంటే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



నెల్లూరులో రాత్రి 11 గంటల సమయంలో తెరిచి ఉన్న మద్యం దుకాణం

మూకెందుకు..

నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్క్వాడ్ అధికారులు కనీసం అటు వైపుగా దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అందుకు కూటమి పెద్దల నుంచి ఒత్తిళ్లు, వ్యాపారులతో ముందస్తు ఒప్పందాలే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం వ్యాపారులు బహిరంగంగానే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా వారి కళ్లకు కనిపించడం లేదని ప్రచారం ఉంది. విమర్శలు నేపథ్యంలో సమస్యను పక్కదారి పట్టించేందుకు బహిరంగ మద్యసేవనం, అరకొరా బెల్టు షాపులపై దాడులు చేస్తున్నారు. అంతా బాగుందని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

పెంచలయ్య మృతదేహానికి అంత్యక్రియలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గుండెపోటుతో మృతిచెందిన దేవళ్ల పెంచలయ్య అంత్యక్రియలకు కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు చేసేందుకు డబ్బుల్లేకపోవడంతో వెంకటేశ్వరపురంలోని ఫ్లై ఓవర్ కింద మృతదేహాన్ని పెట్టుకుని తల్లి వెంకమ్మ, భార్య రాజేశ్వరి బుధవారం రాత్రి నుంచి కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న వైనంపై గురువారం సాక్షి పత్రికలో 'మానవత్వమా.. నీ జాడెక్కడ?' అనే శీర్షికపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో కార్పొరేషన్ కమిషనర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో శానిటరీ సూపర్‌వైజర్ నరసింహారావు, వార్డు అడ్మిన్ చైతన్య, శానిటరీ సెక్రటరీలు లీలావతి, కార్తీక్‌లు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పెంచలయ్య అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లను దగ్గరుండి చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌వర్మ అనే వ్యక్తి ఆ కుటుంబానికి రూ.5,500ను అడ్మిన్ చైతన్య చేతుల మీదుగా అందజేశారు.



పెంచలయ్య మృతదేహాన్ని తీసుకెళ్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెంకటాచలం: మోటార్‌బైక్ డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాచలం – మనుబోలు మండలాల సరిహద్దు ప్రాంతంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజ్‌లో నితీష్‌రెడ్డి (30) అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. అతను బైక్‌పై గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాచలం – మనుబోలు మండలాల సరిహద్దు ప్రాంతమైన అప్పయ్యగేటు వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నితీష్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నితీష్‌రెడ్డి మృతదేహం

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వేర్వేరు ప్రాంతాల్లోని ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు సత్యనారాయణపురానికి చెందిన బి.సుబ్బమ్మకు మతిస్థిమితం లేదు. ఈనెల 20వ తేదీన ఆమె ఇంట్లో నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబసభ్యులు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- జీనిగలవీధిలో భానుచందర్ నివాసం ఉంటున్నారు. ఆయన ఈనెల 19వ తేదీన ఇంట్లో నుంచి అదృశ్యమైయ్యాడు. ఈ మేరకు అతడి భార్య స్వప్న నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా గురువారం తెలిపారు.

వీఎస్‌యూలో 'మత్స్య దినోత్సవం'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ మత్స్య పరిశ్రమలో ఆధునిక సాంకేతికత వినియోగంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రిమోట్ సెన్సింగ్ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలున్నాయని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సముద్ర ఉత్పత్తులను పొందవచ్చని తెలియజేశారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులపై పరిశోధన కొనసాగించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక వినియోగం, సముద్ర వనరుల సమర్థ వినియోగం గురించి అవంతి సీడ్స్ సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలకు 108 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 108 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 111 మందికి గానూ 108 మంది హాజరైనట్లు వెల్లడించారు.

హాకీ పోటీల్లో రాణిస్తూ.. ముందుకు సాగుతూ..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చదువుకునే సమయంలో ఎంతో ఇష్టంగా ఆడిన హాకీ వారికి ఉద్యోగాలు వచ్చేలా చేసింది. ఆ తర్వాత కూడా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపుతున్నారు. క్రీడలపై తమకున్న మక్కువను తెలియజేస్తున్నారు. సాధారణంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం వచ్చిన తర్వాత క్రీడల్లో పాల్గొనడం మానేస్తారు. అయితే ఈ ముగ్గురూ మాత్రం ఓవైపు ఉద్యోగాలు చేస్తూనే మరోవైపు క్రమం తప్పకుండా జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్నారు. జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఈ ఏడాది కూడా ఢిల్లీలో జరిగే జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.



- అరవ సురేఖ జాతీయ స్థాయి హాకీ క్రీడాకారిణి. ఆమె ప్రస్తుతం జిల్లాలోని మాదరాజు గూడూరులో జెడ్పీ హైస్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎందరో పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తూ తాను పోటీల్లో పాల్గొంటారు.



- కడియాల రేవతిది నెల్లూరు. ఆమె ప్రస్తుతం తిరుపతి జిల్లా గూడూరు మండలంలో వెందోడు విలేజ్‌లో మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తోంది. ఈ ఏడాది కూడా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది.



- కొత్తకోట భానుప్రకాష్. జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారుడు. ఇతను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది కూడా జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

బంగారంతో ఉడాయింపు

- వర్కర్లపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ముడి బంగారంతో ఐదుగురు వర్కర్లు ఉడాయించిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఖలీల్ అహ్మద్ గిడ్డంగివీధిలో బంగారు ఆభరణాల తయారీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. వ్యాపారుల నుంచి ఆర్డర్లు తీసుకుని కమీషన్ పద్ధతిపై ఆభరణాలు తయారీ చేసి ఇస్తుంటాడు. అతడి వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ నిజామ్ రెండేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన సహరన్, మౌనిరుల్, ఇదరేష్, సఫీక్, బిశ్వనాథ్ ధాకేలు ఈ ఏడాది ఆగస్టులో ఖలీల్ అహ్మద్ వద్ద పనిలో చేరి నమ్మకంగా ఉండసాగారు. సెప్టెంబర్ 4వ తేదీన ఖలీల్ అహ్మద్ బంగారు ఆభరణాల తయారీ నిమిత్తం సహరన్, మౌనిరుల్, ఇదరేష్‌కు 40 గ్రాములు, సఫీక్‌కు 137 గ్రాముల ముడి బంగారాన్ని ఇచ్చాడు. మేనేజర్ ద్వారా కొంత బంగారాన్ని బిశ్వనాథ్‌కు ఇచ్చాడు. వర్కర్లందరూ కలిసి ఆభరణాలు తయారు చేయకుండా అదే నెల 19వ తేదీన బంగారంతో ఉడాయించారు. బాధితుడు వారి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. ఈ మేరకు బాధిత యజమాని గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్.. ఇదో కొత్త స్కాం

- సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ జి.కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మొద్దు. డిజిటల్ అరెస్ట్‌లాంటివి అసలు ఉండవు' అని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. సైబర్ నేరాలపై సోషల్ మీడియాలో పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన గురువారం వెల్లడించారు. ఇంకా విద్యాసంస్థల్లో కూడా విద్యార్థులకు వివరిస్తున్నట్లు తెలిపారు.



కృష్ణకాంత్, ఎస్పీ

ఏం చేస్తున్నారంటే..

ఓ వైపు సాంకేతికత సరికొత్త పుంతలు తొక్కుతుంటే మరోవైపు సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో సరికొత్త మోసాలకు తెరలేపారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వస్తుంది. తాను ముంబైలోని కొరియర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ పరిచయం చేసుకుంటాడు. మీ పేరుతో విదేశాల నుంచి పార్శిల్ వచ్చిందంటారు. మాకు కొరియర్ రావాల్సిన వస్తువులేమీ లేవని తెలిపినా.. అవతలి వ్యక్తి వినకుండా మీ పేరు, ఫోన్ నంబర్ తెలిపి కొరియర్‌లో డ్రగ్స్, ఆయుధాలున్నాయని భయభ్రాంతులకు గురిచేస్తారు. అదే సమయంలో మీ ఆధార్, పాన్, బ్యాంకు వివరాలను మీ ద్వారానే తెలుసుకుని ముంబై సైబర్‌క్రైమ్/నార్కోటిక్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కాల్ కట్ చేస్తారు. కొద్దిసేపటికి ముంబై సైబర్ క్రైమ్ పోలీసు విభాగం నుంచి ఫోన్ చేస్తున్నానంటూ మరో వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వస్తుంది. మీ పేరుపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందంటూ నకిలీ పత్రాలను వాట్సప్‌లో పంపిస్తారు. మిమ్మల్ని హోటల్ రూమ్ లేదా ఇంట్లోనే ఒక గదిలో ఒంటరిగా ఉంటే విచారణ చేస్తామని నమ్మిస్తారు. విచారణ పూర్తయ్యేంత వరకు కదలడానికి వీల్లేదంటూ కట్టడి చేస్తారు. అనంతరం వీడియో కాల్లో మాట్లాడుతూ మీ వ్యక్తిగత సమాచారం మొత్తం తెలుసుకుంటారు. కేసు నుంచి బయట పడాలంటే తాము చెప్పినంత మొత్తం చెల్లించాలని లేదంటే అరెస్ట్ తప్పదని కంగారు పెడతారు. వారు అడిగినంత ఖాతాలో జమయ్యాక వదిలేస్తారు.



పోలీసు శాఖ రూపొందించిన పోస్టర్లు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మోసగాళ్లు చెప్పేవి నిజమని భావించొద్దు. అసలు డిజిటల్ అరెస్ట్‌లనేవి లేవు. ఇదో పెద్ద స్కాం. సీబీఐ, నార్కోటిక్స్, ఈడీ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాలి. దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియోకాల్లో విచారణ చేయదు. అలా చేస్తే వారు సైబర్ నేరగాళ్లని అర్థం చేసుకోవాలి. ఇలాంటి మోసపూరిత ఫోన్ కాల్ వస్తే సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోరాదు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- భారీగా ఆస్తి నష్టం

విడవలూరు: గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పాపింగారి నాగభూషణం అనే వ్యక్తికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆయన కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నాడు. దీంతో సమీపంలో రేకులతో చిన్న ఇంటిని నిర్మించి రూ.4.50 లక్షలు నగదు, రూ.7 లక్షల విలువైన బంగారం, డాక్యుమెంట్లు, ఫ్రిడ్జ్, గ్యాస్ సిలిండర్, బీరువా తదితరాలను అందులో ఉంచాడు. బుధవారం రాత్రి పనులు ముగిశాక నిద్రించేందుకు రోజూలాగే సమీపంలోని బంధువుల ఇంటికెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో బయటకు పరుగులు తీశాడు. రేకుల ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. సిలిండర్ రెండు ముక్కలై బయటపడి ఉంది. దీంతో అక్కడి వారు భయాందోళనకు లోనయ్యారు. ఈ ఘటనతో సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు నాగభూషణం చెబుతున్నాడు. కొత్త సిలిండర్‌ను బుక్ చేసుకుని, ఇంత వరకు దానిని వినియోగించలేదని, ఎలా పేలిందో అర్థం కావడం లేదని వాపోయాడు. కూలీగా వెళ్లిన సంపాదించిన డబ్బు, వస్తువులు కాలిపోయాయని, కట్టుబట్టలతో మిగిలామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



కాలిపోయిన ఇల్లు

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.43
సన్నవి : రూ.30
పండ్లు : రూ.18



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 100
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 210
లేయర్ చికెన్ : 187

